సాక్షి విశాఖపట్నం

బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



‘తెలుగు బుక్’లో గురుకుల విద్యార్థులకు చోటు

8లో

న్యూస్‌రీల్

రాస పోలమాంబకు కర్బూజాలతో అలంకరణ



తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబను మంగళవారం సుమారు 200 కర్బూజా వండ్లు, జరబర పువ్వులు, గజమాలలతో ఆలయ కమిటీ ప్రతినిధులు అలంకరించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ 108వ అలంకరణకు లక్ష్మీపురం పంచాయతీకి చెందిన వల్లా జయంత్, వెంకటలక్ష్మి దంపతులు సహకారం అందించారు. భక్తులకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదం పంపిణీ చేశారు.

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీ

విశాఖ లీగల్: నగరంలో పలువురు జూనియర్ సివిల్ జడ్జిలు బదిలీ అయ్యారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిఖిత సింగర్ అనకాపల్లి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వెళుతున్నారు. ఏడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.లలితా దేవి పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వెళుతున్నారు. విజయనగరం జిల్లా జిల్లా చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత నగరంలోని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వస్తున్నారు. నగరంలోని ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ కె.శారద విశాఖ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిగా స్థానచలనం పొందారు.

28న జీవీఎంసీ మేయర్ ఎన్నిక

డాబాగార్డెన్స్: జీవీఎంసీ మేయర్ పదవికి సంబంధించి ఈ నెల 28న ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ఫాం-2 ప్రకారం మేయర్ ఎన్నిక కోసం జరిగే ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని కోరుతూ ఈ నెల 24లోగా జీవీఎంసీకి ఎన్నికైన సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. 28న ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి, మేయర్ ఎన్నిక ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు.

మేయర్‌గా హరి వెంకటకుమారి తొలగింపు

జీవీఎంసీ మేయర్‌గా గొలగాని హరి వెంకటకుమారిని తొలగిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19న జరిగిన అవిశ్వాస తీర్మానంలో ఆమె నెగ్గలేదు. ఈ మేరకు మేయర్‌గా ఆమెను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పోలీస్ విభాగాలకు కంప్యూటర్లు



కంప్యూటర్లను అందజేస్తున్న సీపీ బాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ శాఖను సాంకేతికంగా ఆధునీకరించడంలో భాగంగా పలు విభాగాలకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కంప్యూటర్లు, వాటి సంబంధిత పరికరాలు అందించారు. మంగళవారం స్పెషల్ బ్రాంచ్ సమావేశ మందిరంలో 25 కంప్యూటర్లు, 12 ప్రింటర్లు, 5 స్కానర్లను, 10 యూపీఎస్‌లను అందజేశారు. సీఎస్‌బీ, సీసీఆర్‌బీ, ఏడీసీపీ(అడ్మిన్), డీసీపీ క్రైమ్స్ ఆఫీస్, సైబర్ క్రైమ్, రోడ్ ట్రాఫిక్ యాక్సిడెంట్ విక్టిమ్ అసిస్టెంట్ సెల్, మల్కాపురం ట్రాఫిక్, ద్వారకా క్రైమ్, కంచరపాలెం ట్రాఫిక్, గాజువాక ఎస్‌హెచ్‌ఓ, ఏసీపీ(మహిళా పోలీస్‌స్టేషన్)లకు వాటిని కేటాయించారు.

25,26న ట్రైబల్ ఆర్చరీ మీట్

కొమ్మాది: బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న జనజాతీయ గౌరవ్ వర్ష కార్యక్రమంలో భాగంగా జన జాతీయ ఖేల్ మహోత్సవం–ట్రైబల్ ఆర్చరీ మీట్ గీతం కళాశాలలో ఈ నెల 25, 26 తేదీల్లో జరగనుందని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా మిషన్ ఈడీ రాణిమందా తెలిపారు. ఈ పోటీల్లో ఒడిశా, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, అండమాన్ నికోబార్‌కు చెందిన ఆదివాసీలు, ఏపీలోని 8 ఐటీడీఏల నుంచి గిరిజన క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

మన షిప్‌యార్డు మినీ రత్నం!



మూడేళ్లుగా లాభాల బాటలో..

రూ.19 వేల కోట్ల ఆర్డర్లతో బిజీబిజీ

త్వరలోనే మినీరత్న హోదా దక్కే అవకాశం

ఏటా రూ.100 కోట్లకుపైగా నికరలాభం ఆర్జిస్తున్న హిందుస్థాన్ షిప్‌యార్డు

ప్రైవేటీకరణ సమయంలో వైఎస్సార్ చొరవతో నిలబడిన హెచ్‌ఎస్‌ఎల్

ఇండస్ట్రీ విభాగంలో దూసుకెళ్లేలా హిందుస్థాన్ షిప్‌యార్డు అడుగులు వేస్తోంది. దేశీయ నౌకల తయారీపై దృష్టి సారిస్తూ, అత్యుత్తమ సేవలందించేందుకు మినీరత్నగా ఆవిర్భవించనుంది. విశాఖపట్నంను కేవలం షిప్ రిపేర్ హబ్‌గా మాత్రమే కాకుండా.. షిప్ బిల్డింగ్ హబ్‌గా తీర్చిదిద్దేలా రూ.19,048 కోట్లతో 5 భారీ యుద్ధ నౌకల నిర్మాణ పనులను దక్కించుకుంది. నష్టాల బాటలో కొట్టుమిట్టాడిన ఈ నౌకా నిర్మాణ సంస్థ.. దివంగత వైఎస్సార్ చొరవతో కొత్త అవతారం ఎత్తి, ఇప్పుడు తిరుగులేని శక్తిగా అవతరిస్తోంది. ఓ వైపు దేశీయ ఆర్డర్లతో పాటు అంతర్జాతీయ నౌకల మరమ్మతులను దక్కించుకుంటూ చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తోంది.

– సాక్షి, విశాఖపట్నం

1941లో సింధియా షిప్‌యార్డుగా ప్రారంభం కాగా.. 1961లో సంస్థను జాతీయం చేసి హిందుస్థాన్ షిప్‌యార్డుగా పేరు మార్చారు. జల రవాణా మంత్రిత్వ శాఖ పరిధిలోని షిప్‌యార్డు నష్టాలతోనే నడిచి, చివరికి ఉద్యోగాలకు జీతాలివ్వలేని స్థితికి చేరుకుంది. ఈ దశలో ప్రైవేటీకరణే శరణ్యమైంది. విషయం తెలుసుకున్న అప్పటి ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో 2010లో రక్షణ శాఖ పరిధిలోకి షిప్‌యార్డు వచ్చింది. తొలినాళ్లలో ఆర్డర్లు రాక ఇబ్బందులు పడినా.. క్రమంగా ఒక్కో అవరోధాన్ని అధిగమించింది. ఎలాంటి నౌకలు, సబ్‌మెరైన్ల మరమ్మతులైనా రికార్డు సమయంలో పూర్తి చేస్తున్న హెచ్‌ఎస్‌ఎల్.. ఇప్పుడు ప్రధాన నౌకా నిర్మాణ కేంద్రంగా దూసుకుపోతోంది. ఐదేళ్ల కాలంలో ఏకంగా 14 ప్రాజెక్టులను పూర్తి చేసి ఆర్డర్ల పెండెన్సీని గణనీయంగా తగ్గించుకుంది. 40 నౌకల రీఫిట్ పనులను ఐదేళ్ల కాలంలో పూర్తి చేసి ఔరా అనిపించుకుంది.

మినీరత్న హోదా దిశగా..

వరుసగా లాభాల బాటలో పయనిస్తున్న హిందుస్థాన్ షిప్‌యార్డు త్వరలోనే అరుదైన ఘనతని సొంతం చేసుకోనుంది. ఎలాంటి అప్పులు లేకుండా.. ఏటా లాభాలు ఆర్జించే ప్రభుత్వ రంగ సంస్థలకు అందించే మినీరత్న హోదాకు షిప్‌యార్డు పూర్తి అర్హత సాధించింది. ప్రస్తుతం దేశంలో కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్(జీఆర్‌ఎస్‌ఈ), గోవా షిప్‌యార్డు వంటి కొన్ని సంస్థలకు మినీరత్న హోదా ఉంది. నిజానికి, 2023–24 ఆర్థిక సంవత్సరంలోనే షిప్‌యార్డు ఈ ఘనతను సొంతం చేసుకునేది. ఐదు ఫ్లీట్ సపోర్ట్ షిప్స్ నిర్మాణ పనులను తొలుత హెచ్‌ఎస్‌ఎల్‌కు ఇచ్చేందుకు రక్షణ శాఖ సిద్ధమైంది. అయితే చివరి నిమిషంలో రెండు షిప్స్ నిర్మాణ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడంతో షిప్‌యార్డు మూడింటితోనే సరిపెట్టుకుంది. ఈ కారణంగా మినీరత్న హోదా ఒక ఏడాది ఆలస్యమైంది. 40 ఏళ్ల షిప్‌యార్డు చరిత్రలో ఎన్నడూ లేనంతగా.. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,586 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. గతంతో పోలిస్తే 36 శాతం వృద్ధితో రూ.166 కోట్ల నికరలాభాన్ని పొందడంతో.. మినీరత్నగా అవతరించడం లాంఛనంగా మారింది.



వరస ఆర్డర్లతో బిజీబిజీ

మూడు ఫ్లీట్ సపోర్ట్ షిప్స్(ఎఫ్ఎస్ఎస్) నిర్మాణానికి సంబంధించి రక్షణ మంత్రిత్వ శాఖతో హిందుస్థాన్ షిప్‌యార్డు ఒప్పందం కుదుర్చుకుంది. 45 మిలియన్ టన్నుల డిస్‌ప్లేస్‌మెంట్ సామర్థ్యం కలిగిన ఈ నౌకల తయారీ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నౌకల నిర్మాణాల వల్ల హెచ్‌ఎస్‌ఎల్ వార్షిక టర్నోవర్ కూడా గణనీయంగా పెరిగింది. వీటిలో ఒక షిప్‌ని జూలైలో నౌకాదళానికి అందజేసేందుకు హెచ్‌ఎస్‌ఎల్ సిద్ధమవుతోంది.దీంతో పాటు భారత నౌకాదళానికి చెందిన యుద్ధ నౌకలు, కార్గో షిప్స్, పోర్టు గ్రీన్ టగ్‌లు, కోస్ట్‌గార్డ్ వెసల్స్, జలాంతర్గాముల రీఫిట్, మరమ్మతుల పనులతో షిప్‌యార్డు తీరిక లేకుండా ముందుకు సాగుతోంది. అలాగే ఆగ్నేయాసియా దేశాలకు ప్రధాన రక్షణ ఉత్పత్తుల ఎగుమతిదారుగానూ, నౌకల తయారీ కేంద్రంగానూ ఎదగడానికి షిప్‌యార్డు ప్రణాళికలు వేస్తోంది. విదేశీ నౌకలను మరమ్మతు చేయడం ద్వారా అంతర్జాతీయ వ్యాపారాన్ని ఇది వరకే ఆకర్షించిన షిప్‌యార్డు, ఇప్పుడు విశాఖ కేంద్రంగా అంతర్జాతీయ వాణిజ్యంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తోంది. 2021లో 17,000 టన్నుల విదేశీ నౌకను డాక్ చేసి మరమ్మతులు విజయవంతంగా పూర్తి చేసింది. భారత్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో తొలి ఓషన్ సర్వైలెన్స్ షిప్ (ఓఎస్ఎస్) అయిన ఐఎన్ఎస్ ధృవ్‌ను నిర్మించిన హెచ్‌ఎస్‌ఎల్.. 2022లో 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన డైవింగ్ సపోర్ట్ వెసల్స్ ఐఎన్ఎస్ నిస్తార్, ఐఎన్ఎస్ నిపుణ్ నౌకలను విజయవంతంగా అందించి తన సామర్థ్యాన్ని నిరూపించుకుంది. ఇప్పటికే 364 ఎంఎస్ఎంఈ వెండార్ల సహకారం తీసుకుంటున్న హెచ్‌ఎస్‌ఎల్.. మరిన్ని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు చేయూతనందించేందుకు కృషి చేస్తోంది.

ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషి



వరుసగా లాభాల బాటలో షిప్‌యార్డు నడుస్తోందంటే దానికి కారణం ఉద్యోగులు, కార్మికులతో పాటు ఎంఎస్‌ఎంఈల సహకారమే. మినీరత్న హోదా పొందేందుకు అర్హత సాధించడం షిప్‌యార్డు చరిత్రలోనే గొప్ప రోజుగా భావిస్తున్నాం. పెరుగుతున్న ఒప్పందాలకు అనుగుణంగా.. షిప్‌యార్డును ఆధునీకీకరించేందుకు సన్నద్ధమవుతున్నాం. రూ.1000 కోట్లతో యార్డుని రానున్న మూడేళ్లలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. రక్షణ మంత్రిత్వ శాఖతో కుదుర్చుకున్న ఒప్పందం.. షిప్‌యార్డు భవిష్యత్‌ను మార్చబోతోంది. ఫ్లీట్ షిప్స్ తయారీ ద్వారా అనుబంధ పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈలకు కూడా సహకారం లభిస్తుంది. షిప్స్ తయారీలో దాదాపు 90 శాతం వరకు స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన పరికరాలు, సామగ్రిని వినియోగిస్తాం. దేశీయ నౌకల నిర్మాణంతో పాటు అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాలపైనా దృష్టి సారించాం.

– కమొడర్ హేమంత్‌ఖత్రి, సీఎండీ, హిందుస్థాన్ షిప్‌యార్డ్

వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా కేకే రాజు

- అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా అమర్‌నాథ్





సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ, అనకాపల్లి జిల్లాల పార్టీ అధ్యక్షులను నియమించింది. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నియమితులయ్యారు.

27 మంది కార్పొరేటర్లపై వేటు వేయండి

- జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌కు వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు



ఇన్‌చార్జి కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు తైనాల, రవిరెడ్డి, కిరణ్‌రాజు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం సందర్భంగా పార్టీ విప్‌ను ధిక్కరించి, కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసిన వైఎస్సార్ సీపీకి చెందిన 27 మంది కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, పార్టీ నాయకుడు కిరణ్ రాజు కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. మేయర్‌పై అవిశ్వాసం సందర్భంగా వైఎస్సార్ సీపీకి చెందిన 27 మంది కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేసి.. వారితో కూటమికి అనుకూలంగా ఓటు వేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 27 మంది కార్పొరేటర్లకు వైఎస్సార్ సీపీ తరఫున విడిగా విప్‌లు జారీ చేసినప్పటికీ.. వారు పార్టీ ఆదేశాలను ఉల్లంఘించారన్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్ నియమావళిలోని రూల్ 14 ప్రకారం వీరిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కౌన్సిల్ సమావేశం రికార్డుల్లో ఈ విషయం స్పష్టంగా నమోదైందని, ఆ రికార్డుల నకళ్లను పరిశీలించి.. చట్ట ప్రకారం వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఇలాంటి సందర్భాల్లో తీసుకున్న చర్యలను పరిగణలోకి తీసుకుని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని కోరారు.

సివిల్స్‌లో మెరిసిన వైద్యురాలు

సాయి మోహిని మానసకు 975వ ర్యాంకు

ఎంవీపీకాలనీ: చినవాల్తేర్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ రావాడ సాయి మోహిని మానస సివిల్స్ ఫలితాల్లో 975వ ర్యాంకు సాధించారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన ఆమె తల్లిదండ్రులు ప్రకాశరావు, ఉషారాణి ఉద్యోగులు కావడంతో.. 10వ తరగతి వరకు ఆమె విద్యాభ్యాసం ఒకే చోట జరగలేదు. 1 నుంచి 4 వరకు సోంపేటలో వాణీ విద్యానికేతన్, 5వ తరగతి కంచిలి సెయింట్ జోసెఫ్ పాఠశాల, 6 నుంచి 10వ తరగతి వరకు శ్రీకాకుళంలోని శార్వాణి విద్యానికేతన్‌లో చదివారు. విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్, ఆ తర్వాత ఆంధ్రా మెడికల్ కళాశాలలో 2021లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ప్రస్తుతం చినవాల్తేర్ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు వైజాగ్ ఐఏఎస్ అకాడమీ మెంటర్‌షిప్‌లో ముందుకు సాగారు. తొలి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. రెండో ప్రయత్నంలో ప్రిలిమనరీలోనే వెనుదిరిగారు. అయినా ఆత్మస్థైర్యం కోల్పోకుండా మూడో ప్రయత్నంలో 975వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా మానసను డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది అభినందించారు.



తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

సాయి మోహిని మానస ‘సాక్షి’తో మాట్లాడుతూ తాను ఈ స్థాయికి వచ్చేందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని చెప్పారు. ఏం చదవాలనే విషయమై ఒత్తిడి తేకుండా నా ఇష్టానికి వదిలేస్తూ ప్రోత్సహించారని తెలిపారు. సివిల్స్ సాధించడం తన చిన్ననాటి కల అన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను చూసినప్పుడల్లా తాను సివిల్స్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. పేదలకు ఆరోగ్య సేవ చేసేందుకు ప్రభుత్వ వైద్యురాలిగా చేరానని, ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు సేవ చేసే అవకాశం సివిల్స్ ర్యాంక్ వల్ల దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. తమ కుమార్తె మానస తపస్సులా కృషి చేసి మంచి ర్యాంకు సాధించిందని తల్లిదండ్రులు ఉషారాణి, ప్రకాశరావు చెప్పారు. రెండు సార్లు సివిల్స్‌లో అర్హత సాధించనపుడు ఇక ప్రయత్నించవద్దని చెప్పినా.. పట్టు వీడకుండా చదివి విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మానసను వైజాగ్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ గౌతమ్ పోతల సత్కరించారు.

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడి

- ఉలిక్కి పడిన విశాఖ

విశాఖ సిటీ: జమ్ముూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి విశాఖ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ముష్కరుల దాడిలో పలు రాష్ట్రాలకు చెందిన వారు మరణించారు. అనేక మంది గాయపడ్డారు. ఇదిలా ఉంటే విశాఖ నుంచి కొందరు జమ్మూకశ్మీర్ పర్యటనకు వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో వారి కుటుంబసభ్యులు తీవ్ర కలవరానికి గురయ్యారు. కశ్మీర్‌కు వెళ్లిన కొందరి నుంచి వారి కుటుంబ సభ్యులకు ఎటువంటి సమాచారం లేదు. దీంతో వారు ఎక్కడ ఉన్నారన్న విషయంపై ఆందోళన చెందుతున్నారు. విశాఖ ఏసీబీ డీఎస్పీ బి.వి.ఎస్.నాగేశ్వర రావు బంధువు జె.చంద్రమౌళి (70), అతని భార్య జె.నాగమణి మరో నలుగురు కశ్మీర్‌కు వెళ్లారు. వారు ఉన్న సమీప ప్రాంతంలోనే ఉగ్ర దాడి జరిగినట్లు నాగమణి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే చంద్రమౌళి మిస్ అయినట్లు తెలిపారు. దీంతో విశాఖలో ఉన్న వారి బంధువులు ఆందోళన చెందుతున్నారు. అతని సమాచారం కోసం పోలీస్ ఉన్నతాధికారుల ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఉగ్ర దాడిలో మరణించిన, గాయపడిన వారి పేర్లను ప్రకటించారు. ఇందులో విశాఖకు చెందిన వారు ఒక్కరు కూడా లేరు. దీంతో ఇక్కడి వారు ఊపిరి పీల్చుకున్నారు.

నియంత్రణ వద్దు.. పిల్లలే ముద్దు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి, ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి, కలెక్టర్ హరేందిర ప్రసాద్

- జనాభా వృద్ధికి ప్రాధాన్యం ఇవ్వండి
- రాష్ట్ర మంత్రి సంధ్యారాణి పిలుపు

బీచ్‌రోడ్డు: జనాభా వృద్ధి సిద్ధాంతాన్ని, మేనేజ్‌మెంట్ విధానాన్ని అర్థం చేసుకుని అధిక సంతానానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఒక్కరి కంటే ఎక్కువ మంది పిల్లలను కనాలని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నా.. సంక్షేమ పథకాలకు ఢోకా ఉండదని స్పష్టం చేశారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం జరిగిన పోషణ్ పఖ్వాడా–2025 రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు గ్రాట్యుటీ, మట్టి ఖర్చుల విషయంలో సానుకూలంగా వ్యవహరించామని, వివిధ రకాల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా మొదటి 1000 రోజులు పిల్లల సంరక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఊబకాయం లేని పిల్లలు ఉండేలా, ఆరోగ్యకర వాతావరణంలో పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పోషణ్ ట్రాకర్, సమాజ స్థాయిలో తీవ్రమైన, మధ్యస్థాయి పోషక లోపాలతో బాధపడుతున్న పిల్లలను గుర్తించడానికి నిర్దేశించిన కమ్యూనిటీ బేస్డ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఎక్యూట్ మాల్‌నూట్రిషన్ మాడ్యూల్‌ను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు.


పిల్లల పెంపకం విషయంలో పక్షపాతం వద్దు

పిల్లల పెంపకం విషయంలో పక్షపాతం ప్రదర్శించవద్దని.. ఆడ, మగ అనే తేడాను ఎట్టి పరిస్థితుల్లోనూ చూపించరాదని తల్లిదండ్రులకు మంత్రి హితవు పలికారు. ఇద్దరికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, మంచి విలువలు నేర్పించాలని సూచించారు. టీవీ, ఫోన్ల వినియోగానికి పెద్దలు దూరంగా ఉంటూ.. పిల్లలను కూడా దూరంగా ఉంచాలన్నారు. గిరిజన ప్రాంతాలతో (40 శాతం) పోలిస్తే మైదాన ప్రాంతాల్లో (70 శాతం) సిజేరియన్లు అధికంగా ఉంటున్నాయని, ఈ పరిస్థితి మారాలన్నారు.

అప్పుడే స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు సాధించగలం

జపాన్ దేశంలో మాదిరిగా ఇక్కడి పిల్లలకు కూడా ఆరోగ్యకర అలవాట్లను నేర్పించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. అక్కడ పిల్లలకు సైక్లింగ్, వ్యాయామం తప్పకుండా చేయిస్తారని గుర్తు చేశారు. పిల్లలను టీవీలకు, ఫోన్లకు దూరంగా ఉంచుతారని చెప్పారు. ఆరోగ్యకర అలవాట్లు, క్రమశిక్షణతో ఉండటం వల్ల అక్కడి పిల్లల్లో ఊబకాయం, ఇతర అనారోగ్య సమస్యలు కనిపించవన్నారు. ఇక్కడి పిల్లల్లో కూడా అలాంటి మంచి లక్షణాలను పెంపొందించడం ద్వారా స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను సాధించగలమన్నారు. ఈ సందర్భంగా పోషణ్ పఖ్వాడా 2025కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి, అందరూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. పలు అంశాలపై కళాజాత బృందం అవగాహన కల్పించింది. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.సూర్యకుమారి, డైరెక్టర్ వేణుగోపాల్, ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

320 వాహనాల అందజేత



విశాఖ సిటీ: పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన 320 వాహనాలను తిరిగి యజమానులకు అప్పగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. మంగళవారం ఏఆర్ మైదానంలో వెహికల్ హ్యాండోవర్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన వాహనాలను అనేక కారణాలతో తిరిగి పొందలేక ఇబ్బందులు పడుతున్న యజమానులకు ఎటువంటి ఖర్చు లేకుండా అందజేయాలన్న లక్ష్యంతో ఈ మేళాను నిర్వ హించినట్లు చెప్పారు. వాహనాల రిజిస్ట్రేషన్ల నెంబర్ల ద్వారా ఆర్టీఓ, పోలీస్ రికార్డుల నుంచి సమాచారం సేకరించి ప్రత్యేక బృందాల ద్వారా యజమానులను గుర్తించినట్లు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19న తొలిసారి నిర్వహించిన మేళా ద్వారా 152 వాహనాలను యజమానులకు అప్పగించామని వివరించారు. రెండో సారి మేళా ద్వారా ట్రాఫిక్ విభాగం నుంచి సీజ్ చేసిన 272 వాహనాలతో పాటు క్రైమ్ విభాగం నుంచి 37, లా అండ్ ఆర్డర్ నుంచి సీజ్ చేసిన 11 మొత్తంగా 320 వాహనాలను వాటి యజమానులకు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే నిర్వహించిన రెండుసార్లు నిర్వహించిన ఈ కార్యక్రమాల ద్వారా 472 మంది లబ్ధి పొందారని తెలిపారు.



యజమానికి వాహన పత్రాన్ని అందజేస్తున్న సీపీ

క్లుప్తంగా

వచ్చే నెల 20న స్టీల్‌ప్లాంట్‌లో కార్మిక సమ్మె


అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో పాల్గొన్న కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో మే 20వ తేదీన సమ్మె విజయవంతం చేయాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ట్రేడ్ యూనియన్ (సీపీఎస్‌టీయూ) పిలుపు మేరకు జాతీయ కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా మే 20 సమ్మె చేయాలని నిర్ణయించాయి. ఈ అంశంపై మంగళవారం సాయంత్రం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో నాయకులు ఈ మేరకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఈనెల 27న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. మే 2వ తేదీన సమ్మె నోటీసు ఇవ్వాలని, 5వ తేదీన ఉక్కునగరంలో లేబర్ కోడ్స్‌పై సదస్సు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకుల డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, రమణమూర్తి, డి.సురేష్‌బాబు, నన్నాని రావు, బి.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కాంట్రాక్టర్ల సమావేశంలో వాగ్వాదం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం సర్వ సభ్య సమావేశంలో కాంట్రాక్టర్ల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. మంగళవారం ఆశీలమెట్ట సమీపంలో గల వేమన మందిరంలో నిర్వహించిన జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ సమావేశంలో కాంట్రాక్టర్లు సంజీవ్‌రెడ్డి, సత్యనారాయణ మధ్య సోషల్ మీడియాలో జరిగిన పోస్టుల వివాదం చర్చ జరిగింది. జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్‌పై సోషల్ మీడియాలో అనుచితంగా పోస్టులు పెడుతూ రచ్చకెక్కిస్తున్నారంటూ ఇద్దరు కాంట్రాక్టర్లపై ప్రస్తుత జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ చైర్మన్ రొంగలి జగన్నాథం ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ ఆమోదయోగ్యమైతే త్వరలో జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించుకుందామని, దానికి తానూ అంగీకారమే అని పేర్కొన్నారు. అంతేగానీ సోషల్‌మీడియాలో ఒకరిపై మరొకరు అనుచిత వ్యాఖ్యలు చేసుకోవడమే కాకుండా తన పేరును మధ్యలోకి తీసుకురావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మిగతా సభ్యులు ఇరువురిని వారించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

ఎంవీపీకాలనీ: వెంకోజీపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ డి.శ్రీను మృతి చెందాడు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అచ్యుతాపురం చోడపల్లి గ్రామానికి చెందిన శ్రీను (49) తన ఆటోలో న్యూస్ పేపర్లను సప్లయ్ చేస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 2.45 సమయంలో పేపర్ కట్టలను ఆటోలో తీసుకెళ్తుండగా వెంకోజీపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద టిప్పర్ లారీని ఢీకొన్నాడు. తీవ్ర గాయాలపాలైన శ్రీను అక్కడిక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ సిగ్నల్ ఇవ్వకుండా కూడలి సమీపంలో నిలపడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై శ్రీను కుమారుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొందరికే నైట్ డ్యూటీ ఎందుకు?



కేజీహెచ్ నర్సుల డ్యూటీ కేటాయింపులో పక్షపాతం

ఐదేళ్లుగా నైట్ డ్యూటీ చేయని హెడ్, స్టాఫ్ నర్సులు

కాంట్రాక్ట్ ఉద్యోగులపై పనిభారం

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కింగ్ జార్జ్ ఆసుపత్రి(కేజీహెచ్) వివాదాలతో తరచుగా వార్తల్లో నిలుస్తోంది. ఆసుపత్రిలో ఉన్నతాధికారుల మధ్య సమన్వయం లోపించడం, అంతర్గత విభేదాలు తలెత్తడంతో పాటు, నర్సుల డ్యూటీల కేటాయింపులో అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కొందరు నర్సులు నైట్ డ్యూటీలను తప్పించుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారని, దీని వెనుక అవినీతి, పక్షపాతం వంటి అంశాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది.

కేజీహెచ్‌లో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న కొందరు సీనియర్ నర్సులు నైట్ డ్యూటీలకు దూరంగా ఉంటున్నారు. ఉద్యోగ నియమావళి ప్రకారం నర్సులు విధిగా నైట్ డ్యూటీలు చేయాల్సి ఉన్నప్పటికీ, దీని నుంచి మినహాయింపు పొందేందుకు అనేక అడ్డదారులు వెతుకుతున్నారు. అనారోగ్యం, దివ్యాంగురాలినని, గుండె సమస్యలు, క్యాన్సర్ వంటి తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నట్లు అబద్ధపు కారణాలు చూపుతూ.. కొందరు వైద్యుల నుంచి 'సిక్ సర్టిఫికెట్లు' పొందుతున్నారని సమాచారం. ఇలా తప్పించుకుంటున్న వారి కారణంగా నిజంగా అనారోగ్యంతో బాధపడే నర్సులపై, అలాగే తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ నర్సులపై నైట్ డ్యూటీ భారం పడుతోంది.

రోస్టర్ కేటాయింపులో పక్షపాతం?

గ్రేడ్-1 సూపరింటెండెంట్ విజయలక్ష్మి హయాంలో డ్యూటీ రోస్టర్‌ను పరిశీలిస్తే.. కొందరు స్టాఫ్ నర్సులకు మూడు, నాలుగు లేదా ఆరు నెలలకోసారి నైట్ డ్యూటీలు పడుతుంటే.. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులకు మాత్రం రెండు లేదా మూడు నెలలకోసారి నైట్ డ్యూటీలు వేస్తున్నారని సమాచారం. నిజానికి ప్రతి ఆరు నెలల్లో నాలుగు నెలలు డే డ్యూటీ, ఒక నెల నైట్, ఒక నెల మధ్యాహ్నం షిఫ్ట్ చేయాలనే నిబంధన ఉంది. అంటే ఏడాదికి 8 నెలలు డే డ్యూటీ, రెండు నెలలు నైట్, రెండు నెలలు మధ్యాహ్నం డ్యూటీ చేయాలి. కానీ ఈ నిబంధనను తుంగలో తొక్కి, పక్షపాతంగా డ్యూటీలు కేటాయిస్తున్నారని నర్సులు వాపోతున్నారు.

వీరికి నైట్ డ్యూటీ అంటేనే తెలియదు!

కేజీహెచ్‌లో పనిచేస్తున్న కొందరు హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు గత ఐదారేళ్లుగా నైట్ డ్యూటీ అంటేనే తెలియదనే స్థాయిలో ఉన్నారు. వీరిలో హెడ్ నర్సులుగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ సింహాచలం, ఎల్‌టీ ఫ్రాన్సిస్, డి జెస్సీ ఇవెంజలింగ్, ఎల్ఎంఎస్ లక్ష్మి, వై.శారదాంబతో పాటు స్టాఫ్ నర్సులు ఎం.వి.నాగమణి దేవి, మేకల భవాని, సీహెచ్ నీలవేణి, ఎస్.వై. సత్యవతి, ఎ.చిట్టమ్మ, పి.ఇంద్రకళ, ఎం.వి.ఎల్ రాజ్యం, పాత్ర మోసెస్ ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ఏళ్ల తరబడి నైట్ డ్యూటీలకు గైర్హాజరవుతున్నా వీరిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. వీరిలో కొందరు సిక్ సర్టిఫికెట్లు సృష్టించుకుని, మరికొందరు త్వరలో రిటైర్ అవుతాం కదా అని, ఇంకొందరు ఓపీ డ్యూటీ (ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు) చేస్తున్నామని, ఎనిమిది గంటల డ్యూటీ చేస్తున్నప్పుడు నైట్ డ్యూటీ చేయడమేంటని వాదిస్తూ తప్పించుకుంటున్నారని తెలుస్తోంది.

ముడుపులు.. అంతర్గత పోరు?

నైట్ డ్యూటీలు వేయకుండా ఉండటానికి నర్సింగ్ సూపరింటెండెంట్‌కు ఎంతో కొంత చేతులు తడిపితే సరిపోతుందనే ఆనవాయితీ కేజీహెచ్‌లో కొనసాగుతోందని కొందరు నర్సులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఆసుపత్రిలో ఉన్నతాధికారుల మధ్య సమన్వయం పూర్తిగా కొరవడింది. ఒకరంటే ఒకరికి పడటం లేదు. పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకుంటూ లోలోన కుమ్ములాడుకుంటున్నారని సమాచారం. గతంలో పనిచేసిన గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌ను డీఎంఈ సరెండర్ చేసిన సంగతి తెలిసిందే. కొందరు నర్సుల నుంచి డబ్బులు తీసుకుని నైట్ డ్యూటీలు వేయడం లేదనే ఆరోపణలపై ఆమెను విచారించారు. అనంతరం సరెండర్ చేశారు.



ఎప్పుడు మినహాయింపు?

నిబంధనల ప్రకారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 వరకు, రాత్రి 8 నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు నర్సులు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించాలి. నైట్ డ్యూటీ నుంచి మినహాయింపు పొందాలంటే ముందుగా స్థానిక వైద్యుల నుంచి 'సిక్ అండ్ సర్టిఫికెట్'పొందాలి. ఆ తర్వాత బోర్డు ద్వారా ధ్రువీకరించిన ఆ సర్టిఫికెట్‌ను సూపరింటెండెంట్‌కు సమర్పించాలి. సాధ్యసాధ్యాలను పరిశీలించి సూపరింటెండెంట్ మినహాయింపు ఇవ్వవచ్చు. కానీ కేజీహెచ్‌లో ఈ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని తెలుస్తోంది.

భర్తపై వేడి నూనె పోసిన భార్య

అనంతరం గోడ దూకి పరారీ

పరవాడ: భర్తపై సలసల కాగే నూనెను పోసి పరారైన ఓ భార్య ఉదంతం ఇది. పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాలాపువానిపాలెంలో మంగళవారం తెల్లవారు జామున ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పరవాడ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. పరవాడ ఎస్ఐ బి.కృష్ణారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన గండికోట బాలకృష్ణ (30) ఇండియన్ రైల్వేలో లోకో పైలట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన శ్రీకాకుళం జిల్లా బూర్జ గ్రామానికి చెందిన నక్కా రమణమ్మను ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. నెల రోజుల క్రితం బాలకృష్ణకు అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు బదిలీ కాగా.. 20 రోజుల క్రితం కూర్మన్నపాలెం నుంచి సాలాపువానిపాలెం గ్రామానికి మకాం మార్చాడు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి బాలకృష్ణ మద్యం సేవించి భార్యతో గొడవకు దిగాడు. అనంతరం భర్త గదిలో, భార్య రమణమ్మ హాల్లో నిద్రపోయారు. మంగళవారం తెల్లవారుజాము 3 గంటల సమయంలో ఆమె సలసల కాగే నూనెను భర్త బాలకృష్ణ మోహంపై పోసి గోడ దూకి పరారైంది. విషయం తెలుసుకున్న స్థానికులు తీవ్ర గాయాలతో ఉన్న బాలకృష్ణను చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం బాలకృష్ణ కేజీహెచ్‌లో వైద్యం పొందుతున్నాడు. తనపై అనుమానంతోనే భార్య రమణమ్మ వేడి నూనెతో దాడికి పాల్పడిందని.. 2024లో శ్రీకాకుళం జిల్లా బూర్జ గ్రామంలో తమ మధ్య గొడవ జరగ్గా అప్పుడు యాసిడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిందని బాలకృష్ణ పోలీసులకు ఇచ్చిన వాగ్మూలంలో పేర్కొన్నాడు. పరారీలో ఉన్న రమణమ్మ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ కృష్ణారావు చెప్పారు.


కాలిన గాయాలతో బాలకృష్ణ

పోర్టును సందర్శించిన నేపాల్ అధికార బృందం

విశాఖ సిటీ: నేపాల్ ప్రభుత్వ వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి డాక్టర్ గోవింద్ ప్రసాద్ శర్మ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన ప్రతినిధి బృందం మంగళవారం విశాఖ పోర్టును సందర్శించింది. ఈ బృందంలో క్రిషి సమగ్రి కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సాల్ట్ ట్రేడింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ అసిస్టెంట్ సీఈవో కూడా ఉన్నారు. పోర్ట్ డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే నేపాల్ బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్టులో ఉన్న మౌలిక సదుపాయాలు, నిర్వహణ సామర్థ్యం, కీలక వసతులపై పోర్టు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించారు. గ్లోబల్ టెండర్ల ద్వారా యూరియా, డీఏపీ వంటి ఇతర ఎరువుల దిగుమతి అవకాశాలను అన్వేషించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. ఇండో-నేపాల్ ఎరువుల సరకు ఒప్పందం(ట్రీటీ)లో భాగంగా ప్రస్తుతం కోల్‌కత్తా పోర్టులో అమలవుతున్న విధంగా, విశాఖ పోర్టు ద్వారా కూడా బల్క్ రవాణాకు అనుమతి కల్పించే ప్రతిపాదనపై చర్చ జరిగింది. దీని ద్వారా కనీసం రెండు లక్షల టన్నుల అదనపు ఎరువుల సరుకు రవాణా సాధ్యమవుతుందని అంచనా వేశారు. విశాఖ పోర్టుకు వాణిజ్య పరంగా విస్తృత అవకాశాలు ఉన్నాయని నేపాల్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. మంచి వాణిజ్య వసతులు కల్పిస్తే ఒకటిన్నర నుంచి రెండు లక్షల టన్నుల సరుకును విశాఖ పోర్ట్ నుంచి నిర్వహించే వీలు కలుగుతుందని పేర్కొన్నారు.


పోర్టు అధికారులతో నేపాల్ అధికార బృందం సమావేశం

14 షాపులు, హోటళ్లలో ఆహారం కల్తీ

రూ.3.15 లక్షల జరిమానా విధించిన జేసీ

బీచ్‌రోడ్డు: నగరంలో ఆహార కల్తీపై అధికారులు కొరడా ఝళిపించారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో ఆహార కల్తీకి పాల్పడిన 14 షాపులు, హోటళ్లపై జేసీ మయూర్ అశోక్ చర్యలు చేపట్టారు. మొత్తం 14 దుకాణాలకు రూ.3.15 లక్షల జరిమానా విధించారు. విశాఖ జోన్-2 పరిధిలో ఆహార భద్రత అధికారి జి.అప్పారావు ఇటీవల పలు దుకాణాల నుంచి ఆహార నమూనాలను సేకరించారు. ఈ నమూనాలను పరిశీలించగా.. 14 దుకాణాల్లోని నమూనాల్లో కల్తీ జరిగినట్లు నిర్ధారణ అయింది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కల్తీకి పాల్పడిన వారిపై జేసీ కఠిన చర్యలు తీసుకున్నట్లు జిల్లా సహాయ ఆహార నియంత్రణ అధికారి నందాజీ వెల్లడించారు. సరధృవ్(సిరిపురం) హాస్పిటాలిటీకి రూ.50 వేలు, సస్‌ప్రా(బీచ్‌రోడ్డు) హోటల్‌కు రూ.50 వేలు, గగన్ బెంగళూరు అయ్యంగార్(అక్కయ్యపాలెం) బేకరీకి రూ.10 వేలు, లీలామహల్ థియేటర్(సూర్యబాగ్) క్యాంటీన్‌కు రూ.15 వేలు, కోయంబత్తూర్(ఎంవీపీ) కాఫీకి రూ.5 వేలు, పూర్ణామార్కెట్‌లోని ఓ మిల్క్ వ్యాపారికి రూ.15 వేలు, అన్నపూర్ణ(లాసన్స్‌బే కాలనీ) ఫుడ్స్‌కు రూ.25 వేలు, కెల్విన్(ఎంవీపీ)కు రూ.15 వేలు, హనిరైస్ అండ్ జనరల్ స్టోర్(ఎంవీపీ)కు రూ.50 వేలు, ఎంవీపీ లేడీస్ హాస్టల్‌కు రూ.25వేలు, ఎస్.కె.ఎం.ఎల్(మద్దిలపాలెం) ఎంటర్ ప్రైజెస్‌కు రూ.15 వేలు, ఓం సాయి కనక మహాలక్ష్మి కిరాణా(ఎంవీపీ)కు రూ.5వేలు, శ్రీ పద్మావతి రెస్టారెంట్(ఎంవీపీ)కు రూ.25వేలు, సూర్య ప్యూరిఫైడ్ వాటర్(అల్లిపురం)కు రూ.10 వేల జరిమానా విధించినట్లు వివరించారు.

సెల్‌ఫోన్ కోసం విద్యార్థిని వీరంగం

- అధ్యాపకురాలిని చెప్పుతో కొట్టిన వైనం
- రఘు ఇంజినీరింగ్ కళాశాలలో ఘటన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ఉద్యోగానికి రాజీనామా చేసిన ఫ్యాకల్టీ?

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రిలోని రఘు ఇంజినీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ప్రవర్తన తీవ్ర చర్చనీయాంశమైంది. ఎన్‌సీసీ ఫ్యాకల్టీ తన ఫోన్ తీసుకుందన్న కోపంతో సోమవారం క్యాంపస్ ఆవరణలో ఆమె ఎదురుకాగానే ఆ విద్యార్థిని పెద్ద గొంతుతో రెచ్చిపోయింది. అసభ్య పదజాలం ఉపయోగిస్తూ.. అసహ్యకరంగా నడుం తిప్పుతూ వెకిలి చేష్టలు చేసింది. 'నీవు తీసుకున్న ఫోన్ రూ.12 వేలు.. ఇస్తావా లేదా చెప్పుతో కొట్టమంటావా'అంటూ హెచ్చరించడమే కాకుండా అన్నంత పని చేసింది. చెప్పుతో కొట్టడంతోపాటు 'ఎన్‌సీసీ అయితే ఎవరికి ఎక్కువ' అంటూ దుర్భాషలాడింది. అక్కడే ఉన్న విద్యార్థులు విడిపించినా ఆ విద్యార్థిని వెనక్కి తగ్గలేదు. ఈ సంఘటన సోమవారం జరగగా.. దీనికి సంబంధించిన వీడియో మంగళవారం బయటకు రావడంతో ప్రస్తుతం అంతటా ఇదే చర్చ జరుగుతోంది.

మహిళా ఫ్యాకల్టీ రాజీనామా?

కళాశాల ఆవరణలో జరిగిన ఈ సంఘటనపై తీవ్రంగా కలత చెందిన రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు అధ్యాపకులతో వెంటనే సమావేశం అయినట్టు తెలిసింది. ఈ వీడియో రాష్ట్ర వ్యాప్తంగా వైరల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఎన్‌సీసీ ఫ్యాకల్టీ తన పదవికి రాజీనామా చేసినట్టు సమాచారం. తోటి ఫ్యాకల్టీ వారించినా, ఇంత అవమానం జరిగిన చోట పని చేయలేనని ఆమె తేల్చిచెప్పినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా విద్యార్థిని తల్లిదండ్రులు కళాశాలకు రావాలని యాజమాన్యం సమాచారం అందించినా వారు స్పందించలేదని సమాచారం. కళాశాలలో జరిగిన సంఘటన పట్ల నెటిజన్లు మండిపడుతున్నారు. సమాజం ఎటు పోతుందని, తల్లిదండ్రుల గారాభంతో కొని ఇచ్చిన సెల్‌ఫోన్లకు పిల్లలు బానిసలుగా మారుతున్నారని విమర్శించారు. ఇదిలా ఉండగా మధురవాడకు చెందిన ఆ విద్యార్థినికి మతిస్థిమితం సరిగా లేదన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

చెవికి ఎక్కని మంచి మాటలు

ఈ నెల 10న రఘు ఇంజనీరింగ్ కళాశాలలో 'నవ సమాజ నిర్మాణం'పేరుతో విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు వద్దని సూచించారు. డ్రగ్స్, సెల్‌ఫోన్‌ల వల్ల అనర్థాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. కానీ వాటిని అదే కళాశాలకు చెందిన విద్యార్థిని చెవికి ఎక్కించుకున్నట్టు లేదు. ఈ నెల 21న కళాశాల ఆవరణలో జరిగిన ఈ వ్యవహారం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

కోపం వస్తే కొడతా..

విద్యార్థి చేతి వేళ్లు వంచి కొట్టిన ఉపాధ్యాయుడు

తగరపువలస: నగరపాలెం వద్ద గోవుపేటలోని ప్రెసిడెన్సియల్ స్కూల్‌కు చెందిన ఓ ఉపాధ్యాయుడు మంగళవారం 9వ తరగతి విద్యార్థిపై తన ప్రతాపాన్ని చూపాడు. ఇంటి వద్ద ఉన్న కోపాన్ని విద్యార్థిపై చూపించి, అతని చాతీపై గుద్ది, చేతి వేళ్లను వెనక్కి వంచేశాడు. దీంతో విద్యార్థి చాతీపై దెబ్బ తగిలిన చోట కమిలిపోయింది. చేతి వేళ్లు వాచిపోయాయి. చాతీ నొప్పితో, వేళ్లను మడవలేకపోయిన విద్యార్థి తగరపువలసలో ఉన్న తన తల్లిదండ్రులకు జరిగిన విషయం చెప్పాడు. 'నాకు కోపం వస్తే అంతే.. పక్కన ఎవరుంటే వారిని కొట్టేస్తాను. ఈ రోజు వీడు బలయిపోయాడు' అంటూ విద్యార్థిపై దాడి చేసిన తర్వాత ఆ ఉపాధ్యాయుడు మిగిలిన విద్యార్థులతో చెప్పినట్లు సమాచారం. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు మనస్తాపానికి గురై పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు.


విద్యార్థి చాతీపై ఎర్రగా మారిన భాగం


వాచిపోయిన విద్యార్థి చేతివేళ్లు

మెడికల్ విద్యార్థుల డిమాండ్లకు తలొగ్గిన యాజమాన్యం

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ విద్యార్థుల డిమాండ్లకు ఎట్టకేలకు యాజమాన్యం దిగి వచ్చింది. ఈ నెల 19న కళాశాల విద్యార్థి శీరం దత్త ప్రణీత్ కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. విద్యార్థి ఆత్మహత్యకు వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, డీన్ పీవీ సుధాకర్ కారణమంటూ విద్యార్థులు నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు వారిని విధుల నుంచి తొలగించాలని కోరుతూ విద్యార్థి సంఘాలు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం కళాశాలలో యాజమాన్యంతో సుదీర్ఘ మంతనాలు సాగించిన తరువాత వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డిని తొలగించడానికి డీన్ సుధాకర్ అందుబాటులో లేనందున స్పష్టత కోసం రెండు నుంచి మూడు వారాలు గడువు కోరినట్టు తెలిపారు. విద్యార్థులు, యాజమాన్యంతో చర్చల సందర్భంగా మీడియాను అనుమతించకపోవడంతో పాటు విద్యార్థులు ఎవరూ ఫొటోలు, వీడియోలు తీయకుండా కొందరు ప్రయివేట్ వ్యక్తులు కాపలాగా వ్యవహరించారని విద్యార్థులు ఆరోపించారు. అలాగే చర్చల్లో భాగంగా తమను భయభ్రాంతులకు గురిచేసి ఒత్తిళ్లకు గురిచేయాలని ప్రయతించినట్టు తెలిపారు.

దత్త ప్రణీత్ ఆత్మశాంతికి క్యాండిల్ ర్యాలీ

మెడికల్ విద్యార్థి దత్త ప్రణీత్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ విద్యార్థులు సాయంత్రం కళాశాలలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

'తెలుగు బుక్'లో గురుకుల విద్యార్థులకు చోటు

సబ్బవరం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సబ్బవరం గురుకుల పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. పీరియాడిక్ టేబుల్, భౌతిక స్థిరంకాలు, ఫార్ములాలు, రసాయనిక ఫార్ములాలను అతి తక్కువ సమయంలో చెప్పడం ద్వారా ఈ ఘనతను సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ మంగళవారం తెలిపారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి వి.వి.బుచ్చిరాజు, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, సీఐ పిన్నింటి రమణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు వి.వి.జె.వేణుగోపాలరావు, వెల్ఫేర్ ఇంజినీరింగ్ కాలేజీ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ కె.జయరాం, డాక్టర్ మూర్తి సమక్షంలో పీరియాడిక్ టేబుల్‌ను పఠించారు. పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు 16 సెకన్ల నుంచి 23 సెకన్ల స్వల్ప వ్యవధిలో టేబుల్‌ను పఠించగా.. వారిని గైడ్ చేసిన డాక్టర్ టి.రాంబాబు 37 సెకన్లలో చెప్పారు.ఈ మేరకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుని.. సర్టిఫికెట్ పొందారు. కాగా.. పీరియాడిక్ టేబుల్‌ను 22 సెకన్లలో చెప్పిన రికార్డ్స్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైనట్లు గైడ్ తెలిపారు. విద్యార్థులతో పాటు గైడ్, ప్రిన్సిపాల్ రామకృష్ణను విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల సమన్వయకర్త సి.ప్రభావతమ్మ అభినందించారు.

మే 20 వరకు తొలగింపులు ఉండవు

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు వార్తలపై యాజమాన్యాన్ని కలిసిన కార్మిక సంఘాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఇటీవల కాంట్రాక్ట్ కార్మికులను తొలగించలేదని యాజమాన్యం చెప్పినట్లు అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఇటీవల 170 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించినట్లు ప్రచారం జరిగిన నేపథ్యంలో మంగళవారం నాయకులు స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. గతంలో సమ్మెకు ముందు జరిగిన చర్చల సందర్భంగా మే 20 వరకు ఎటువంటి తొలగింపులు ఉండవని యాజమాన్యం హామీ ఇచ్చిన విషయాన్ని కార్మిక నాయకులు హెచ్‌ఆర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు ఇటీవల ఎవరినీ తొలగించలేదని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, మే 20 వరకు ఎటువంటి తొలగింపులు ఉండవని పునరుద్ఘాటించారు. ఒక వేళ అటువంటి తొలగింపులు ఏమైనా జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. సమావేశంలో హెచ్‌ఆర్ జీఎంలు ఎం.మధుసూదనరావు, ఎస్.భాను, డీజీఎం ఖర్‌తో పాటు అఖిలపక్ష నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కె.ఎం.శ్రీనివాస్, నమ్మి రమణ, కురందాసు వంశీకృష్ణ, మంత్రి రవి, జి.రమణ, ఉమ్మిడి అప్పారావు, భాస్కరరావు, ఎ.శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.


ఉక్కు హెచ్‌ఆర్ ఉన్నతాధికారులతో సమావేశమైన కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు

జీవో నం. 3పై తప్పుదోవ పట్టిస్తున్న మంత్రి

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర



అల్లిపురం: జీవో నంబర్ 3 పై మంత్రి గుమ్మడి సంధ్యారాణి గిరిజనులను తప్పుదోవ పట్టిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ కుంభా రవిబాబు ఆరోపించారు. సోమవారం పాడేరులో జరిగిన ఐటీడీఏ పాలకవర్గ సమావేశంలో మంత్రి సంధ్యారాణి అవగాహన లేకుండా మాట్లాడారని చెప్పారు. మద్దిలపాలెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలోని ఆయన మాట్లాడారు. జీవో నంబరు 3ను పునరుద్ధరిస్తామని ఎన్నికల ప్రచార సమయంలో చంద్రబాబు గిరిజనులకు హామీ ఇచ్చారని చెప్పారు. ఇప్పుడు ఆ జీవోను పునరుద్ధరించడం కుదరదని మంత్రి చెబుతున్నారన్నారు. జీవో నంబరు 3కు బదులుగా మరో జీవో తెస్తామని చెబుతూ గిరిజనులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. జీవో నంబరు 3పై సుప్రీంకోర్టులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసినట్టు తెలిపారు. ఆ విషయం కూడా తెలియకుండా మంత్రి మాట్లాడటం ఆ శాఖపై ఆమెకు ఎంత అవగాహన ఉందో అర్థమవుతోందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. గిరిజన ప్రాంతంలో వైద్య సౌకర్యాలు మెరుగుపరచడంతో పాటు మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకి దక్కుతుందని చెప్పారు. మే 1 నుంచి ఆందోళన చేపట్టేందుకు గిరిజన సంఘాలు సన్నద్ధమవుతున్నాయని, ఆదివాసీ బిడ్డలను మోసం చేస్తే సహించేది లేదన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

- వాటిని కొనుగోలు చేసిన ఇద్దరిపై కేసు
- పెందుర్తి, దువ్వాడ ప్రాంతాల్లో చోరీ చేసిన 16 బైక్‌ల స్వాధీనం

పెందుర్తి: కరుడుగట్టిన బైక్‌ల దొంగ ఆటకట్టించారు పోలీసులు. 16 బైక్‌లను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు. ఆయా బైక్‌లను కొనుగోలు చేసిన వారిని(రిసీవర్‌లు) అదుపులోకి తీసుకున్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో నగర క్రైం విభాగం ఏడీసీపీ వివరాలను వెల్లడించారు. కూర్మన్నపాలెం ఎన్‌టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న తోటాడ నితిన్‌కుమార్ అలియాస్ బొగ్గు(19) పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను అపహరించడంలో దిట్ట. ఈ క్రమంలో ఈ ఏడాది నాలుగు నెలల వ్యవధిలో పెందుర్తి, దువ్వాడతో పాటు ఒడిశా ప్రాంతాల్లో మొత్తం 16 ద్విచక్ర వాహనాలను చాకచక్యంగా అపహరించుకుపోయాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న పెందుర్తికి చెందిన సరగడం శివసంతోష్ అనే వ్యక్తి తన ఇంటి ముందు బైక్‌ను పార్కింగ్ చేయగా నితిన్‌కుమార్ అపహరించుకుపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పెందుర్తి క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకున్నట్లు ఏడీసీపీ వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో అతడు చోరీకి పాల్పడిన రూ.11 లక్షల విలువైన 16 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అతడితో పాటు రిసీవర్‌లు కూర్మన్నపాలెం రాజీవ్‌నగర్‌కు చెందిన తంపర గణేష్(18), ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన గొట్టిప కృష్ణ అలియాస్ కన్నా(17)ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుడు నితిన్ కుమార్‌పై గతంలో మోటార్‌సైకిల్ దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌తో పాటు హత్యాయత్నం కేసులు ఉన్నాయని వివరించారు. ఆయా కేసుల్లో ప్రతిభ కనబరిచిన వెస్ట్ జోన్ సీఐ ఎస్.శ్రీనివాసరావు, పెందుర్తి ఎస్ఐ డి.సూరిబాబు, ఏఎస్ఐ మూర్తి, పెందుర్తి, దువ్వాడ హెచ్‌సీలు జి.నాగరాజు, ఎఎస్ఆర్ ప్రసాద్, ఎన్.మురళి, పీసీలు టి.శివప్రసాద్, బి.దేముడునాయుడు, ఎల్.కె తాతారావు, ఎల్.సింహాచలంనాయుడు, వి.విజయ్‌కుమార్‌లను ప్రత్యేకంగా అభినందించారు.


స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో క్రైం ఏడీసీపీ మోహనరావు, అధికారులు, సిబ్బంది